తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

సోమవారం

23 నవంబర్ 2026



వీధుల్లో కుక్కల స్థైర విహారం

- వెంబడించి పరుగులు పెట్టిస్తున్న శునకాలు
- గ్రామసింహాలతో గజగజ లాడుతున్న పట్టణ ప్రజలు

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 22(జనంసాక్షి):
సంగారెడ్డి పట్టణంలోని పలు వీధుల్లో కుక్కలు స్థైర విహారం చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలలో, పట్టణ వీధులలో గుంపులు గుంపులుగా కుక్కలు తిరుగుతూ భయాందోళనకు గురి చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. గ్రామ సింహాల ఎప్పుడు ధాటికి చేస్తాయోనని ప్రజలు గజగజ లాడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్లపై కుక్కల బెడద తీవ్రంగా ఉందని, బయటకు రావడానికి ప్రజలు, చిన్నపిల్లలు భయపడుతున్నారు.



వయస్సుతో సంబంధం లేకుండా గ్రామసింహాలు వెంబడించి మరీ పరుగులు పెట్టిస్తున్నాయి. సంగారెడ్డి పట్టణంతోపాటు, గ్రామాలలో కుక్కలు ప్రజలను తీవ్రభయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్రవాహనదారులను వెంబడిస్తున్నాయి. వీధికుక్కల స్థైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.



రాత్రివేళల్లో రోడ్లపైకి గుంపులుగుంపులుగా వచ్చి రోడ్లపై నుంచి దాడులు చేస్తుండడంతో కుక్కలు కనబడితే చాలు ప్రజలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు.

ప్రతిరోజూ జిల్లాలో ఎక్కడో ఒకచోట కుక్కల దాడులతో గాయపడిన ఘటనలు చోటుచేసుకుంటున్నా, అధికారులు మాత్రం సంఘటనల తరువాత స్పందించి మళ్లీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వీధుల్లో కుక్కల స్థైరవిహారం.....

సంగారెడ్డి పట్టణంలో వీధికుక్కల బెడద పెరిగిపోయింది. ముఖ్యంగా పట్టణంలోని ఆదర్శనగర్, శిల్పావెంజర్, కాకతీయ నగర్, ఎంఆర్ఎఫ్ కాలనీ, బృందావన్ కాలనీ, గీత నగర్ తదితర కాలనీలలో కుక్కలు స్థైరవిహారం చేస్తూ, పిల్లలపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. ఇంటి నుంచి బయట అడుగు పెట్టాలంటే ఆలోచించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ వీధికుక్కలను కట్టడి చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సంగారెడ్డి పట్టణంలోని వీధి కుక్కలను నియంత్రించాలని ఆయా కాలనీలా ప్రజలు కోరుతున్నారు.

ఇసుక మాఫియా దోపిడీ..!

- అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత
- అనుమతులు లేకుండా అధిక లోడుతో రవాణా
- నామమాత్రపు కేసులతో సరిపెడుతున్నారన్న స్థానికులు



గద్వాల, నవంబర్ 22 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లాలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ టిప్పర్‌ను పోలీసులు ఆదివారం తమ అధీనంలోకి తీసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడం, పరిమితికి మించి అధిక లోడుతో ఇసుక రవాణా చేస్తుండటంతో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఒకవైపు అక్రమార్కులు విలువైన జాతీయ సంపదను యథేచ్ఛగా దోచుకుంటున్నా, సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో కట్టడి చేయలేకపోతున్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా ముమ్మరంగా సాగుతున్నా, అధికారులు అక్కడక్కడా నామమాత్రపు కేసులు నమోదు చేసి చేతులు దులుపు కుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రివేళల్లో పెద్ద ఎత్తున ఇసుక తరలిపోతుండటంతో వాగులు, వంకలు గుంతలమయంగా మారుతున్నాయి. ఫలితంగా సమీప గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఏర్పడిందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధిక లోడుతో వెళ్తున్న భారీ టిప్పర్ల వల్ల గ్రామీణ రహదారులు పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. చిన్నపాటి దాడులతో సరిపెట్టకుండా, ఇసుక మాఫియా వెనుక ఉన్న అసలు సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పట్టుబడిన టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, వాహన యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నేటి నుంచి
ఇందిరమ్మ బీమా నమోదు శిబిరాలు



చేర్యాల, నవంబర్ 22 (జనంసాక్షి): చేర్యాల మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి అర్హుల నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు చేర్యాల ఎంపీడీఓ అణభేరి ప్రణయ్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 23 నేటి నుంచి డిసెంబర్ 19 వరకు నాలుగు దశల్లో ఆయా జీపీ కార్యాలయాల్లో క్యాంపులు జరుగుతాయని, 100 శాతం నమోదు కోసం ప్రజలు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు.

పిల్లలపై లైంగిక నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి): చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులు, లైంగిక దాడులను అరికట్టి, వారికి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,విద్యాసంస్థలు, సమాజంలోని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలబాలికలపై జరిగే లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, అసభ్యంగా తాకడం, లైంగిక ఉద్దేశంతో అనుచితంగా ప్రవర్తించడం, అశ్లీల చిత్రాలు లేదా వీడియోలు చూపించడం వంటి నేరాలను అరికట్టేందుకు పోక్సో చట్టం అమల్లో ఉందని తెలిపారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహ పూర్వకంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకో వాలని, పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాను చిన్న వయస్సు నుంచే వివరించాలని సూచించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, అసభ్యంగా తాకినా, బెదిరించినా భయపడకుండా తల్లిదండ్రులకు లేదా నమ్మకమైన పెద్దలకు చెప్పేలా పిల్లలకు ధైర్యం కల్పించాలన్నారు. అపరిచితులు ఇచ్చే బహుమతులు, చాక్లెట్లు స్వీకరిం చకూడదని, ఎవరైనా రహస్యంగా ఉంచాలని ఒత్తిడి చేసినా వెంటనే కుటుంబ సభ్యులకు తెలియజేయాలని పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు.

అదేవిధంగా సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా పరిచయమయ్యే అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలు పంచుకోరాదని, అనుమానాస్పద సందేశా లు లేదా వేధింపులు ఎదు రైతే వెంటనే పెద్దలకు తెలి యజేయాలనిసూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు పోక్సో చట్టం పై అవగాహనకార్యక్రమాలు నిర్వహించాలని, పిల్లలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేలా భద్రమైన వాతావరణాన్ని కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలపై లైంగిక వేధింపుల విషయం తెలిసినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, బాధిత చిన్నారులను నిందించకుండా వారికి అండగా నిలవాలని ఎస్పీ కోరారు. బాధితుల పేర్లు, ఫొటోలు, చిరునామా, పాఠశాల వివరాలు వంటి గుర్తింపును వెల్లడించే సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచా రం చేయకూడదని, వారి గోప్యతను కాపాడాలని తెలిపారు. ఎక్కడైనా చిన్నారులపై లైంగిక వేధింపులు లేదా దాడులు జరుగుతు న్నట్లు తెలిసినా, బాధితులు సహాయం కోరినా వెంటనే పోలీసులకు లేదా అత్యవ సర పోలీస్ సహాయ నంబర్ 112కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. చిన్నారులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం, వారి హక్కులను పరిరక్షించడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. చిన్నారుల భద్రత మనందరి బాధ్యత – బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

దళితుల భూములకు రక్షణ కల్పించలేని కాంగ్రెస్‌కు దళిత చైతన్య సభలు నిర్వహించే హక్కు ఎక్కడిది?



- దళిత కుటుంబానికి న్యాయం చేయకుండా చైతన్య సభల పేరుతో మభ్యపెట్టడం విడ్డూరం
- ఎమ్మెల్యే అనుచరులపై ఆరోపణలు చేసిన బహుజన నాయకుడు రెడ్డపాకుల శివశంకర్

తెలకపల్లి, నవంబర్ 22 (జనంసాక్షి):
దళిత కుటుంబాలకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోని కాంగ్రెస్ పార్టీ, మరోవైపు దళిత చైతన్య సభలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని బహుజన నాయకులు రెడ్డపాకుల శివశంకర్ విమర్శించారు. మండల పరిధిలోని నడిగడ్డ గ్రామానికి చెందిన వడ్డేమాన్ కృష్ణయ్యకు సంబంధించిన 1.27 గుంటల భూమిని అప్పు పేరుతో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అనుచరుడు నారాయణరెడ్డి అన్యాయంగా స్వాధీనం చేసుకున్నారని ఆరోపిస్తూ మండలానికి చెందిన బహుజన నాయకులు పత్రికా సమావేశం నిర్వహించారు.
ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను చట్టసభల్లోకి రాకుండా చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించిందని, ఎన్నికల్లో ఆయనను ఓడించి అవమానించిందని విమర్శించారు. ప్రస్తుతం అదే పార్టీ అధికారంలో ఉండగా దళితుల భూములపై దాడులు, ఆక్రమణలు జరుగుతున్నా స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఒకవైపు దళిత చైతన్య సభల పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తూ, మరోవైపు దళిత కుటుంబాలకు అన్యాయం జరుగుతున్నా మౌనం వహించడం ఏమిటని ప్రశ్నించారు. వడ్డేమాన్ కృష్ణయ్య భూమి విషయంలో న్యాయం చేయాలని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. తెలకపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నారాయణరెడ్డి పేరుపై ఉన్న ఎకరా భూమిని ఇతరులకు విక్రయించవద్దని కోరినప్పటికీ, అధికార పార్టీ నాయకుల అండదండలతో ఆ భూమిని తాళ్లపల్లి గ్రామానికి చెందిన మందునాగుల సుధాకర్ పేరుపై మార్చినట్లు ఆరోపించారు. కృష్ణయ్యకు ఎలాంటి అన్యాయం జరగకపోతే భూమి యాజమాన్యపు పేరు మార్పిడి ఎందుకు జరిగిందని ప్రశ్నించారు. నారాయణరెడ్డి పేరు మీద ఉన్న భూమిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండపల్లి పర్వతాలు స్వగ్రామానికి చెందిన వ్యక్తి పేరుపై మార్చడం వెనుక ఉన్న కారణాలను అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దళిత కుటుంబానికి చెందిన వడ్డేమాన్ కృష్ణయ్య భూమిని తిరిగి ఆయన పేరుపై నమోదు చేసి న్యాయం చేయాలని శివశంకర్ డిమాండ్ చేశారు.
బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే వివిధ దళిత సంఘాలను కలుపుకొని మండలంతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బహుజన నాయకులు కొమ్ము రాకేష్, గాలోటి వెంకటయ్య, వడ్డమని శివ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉచిత సాంకేతిక శిక్షణ

డిసెంబర్ 1 నుంచి కల్వకుర్తిలో సుంకిరెడ్డి నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం




కల్వకుర్తి, నవంబర్ 22 (జనంసాక్షి): గ్రామీణ యువతకు ఆధునిక సాంకేతిక విద్యను ఉచితంగా అందించి ఉపాధి అవకాశాలకు మార్గం చూపాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తిలో ఏర్పాటు చేస్తున్న సుంకిరెడ్డి నైపుణ్య శిక్షణ కేంద్రం డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు శిక్షణ కేంద్రంలో జరుగుతున్న ఏర్పాట్లను ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ముఖ్య నిర్వహణాధికారి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పాత కృష్ణవేణి జూనియర్ కళాశాల భవనంలో ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రంలో ఆధునిక కంప్యూటర్ ప్రయోగశాలతో పాటు వివిధ శిక్షణ సౌకర్యాలు కల్పిస్తున్నారు. కృత్రిమ మేధ,జావా, పైథాన్, అంతర్జాల మార్కెటింగ్, అధునాతన ఎక్సెల్, ట్యాలీ, పన్నుల విధానం తదితర అంశాల్లో ఉచిత శిక్షణ అందించనున్నారు. వ్యక్తిత్వ వికాసం, సంభాషణ నైపుణ్యాలు, ఉద్యోగ ఇంటర్వ్యూలపై కూడా శిక్షణ ఇస్తారు.
ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా గ్రామీణ యువతకు ఆధునిక సాంకేతిక విద్య అందించడమే తమ లక్ష్యమన్నారు. శిక్షణతో పాటు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన మార్గదర్శకత్వం, ఉద్యోగావకాశాల కల్పనలో సహకారం అందిస్తామని తెలిపారు. నియోజకవర్గ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్ చిరునామా:
https://docs.google.com/forms/d/e/1FAIpQLSfKB0e-haSIIsIhqdoD6AkaY3uLfRJiGnME-rXJTQ-n4z939A/viewform?uspRsend_form
వివరాలకు: 6300553467 ఈ ఫోన్ నెంబర్‌ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు జైపాల్ రెడ్డి, నరేందర్ గౌడ్, యూసుఫ్ బాబా, రఘు, శేఖర్, శ్రీపతి, రమేష్ యాదవ్, శ్రీను, మల్లేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో 24న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవం

- 24న హైకోర్టు న్యాయమూర్తుల రాక

తూప్రాన్, నవంబర్ 22 (జనంసాక్షి):
తూప్రాన్‌లో నూతనంగా ఏర్పాటు కానున్న కోర్టు ఆఫ్ జూనియర్ సివిల్ జడ్జి – కమ్ – జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ ప్రారంభోత్సవం మంగళవారం, 24వ తేదీ నవంబర్ 2026, ఉదయం 11:00 గంటలకు ఘనంగా జరగనుంది.
ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, మెదక్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి లిగౌరవనీయులు శ్రీ జస్టిస్ సుద్దాల చలపతి రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు.




ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు లిగౌరవనీయులు శ్రీ జస్టిస్ బి. విజయసేన్ రెడ్డి గౌరవనీయులు శ్రీ జస్టిస్ నర్సింగ్ రావు నందికొండ, అనిల్ కుమార్ హైకోర్టు న్యాయమూర్తి అనిల్ కుమార్ జూకంటి విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు.
ఈ ఆహ్వాన పత్రికను మెదక్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి జి. నీలిమ డిస్ట్రిక్ట్ కోర్టు బార్ అసోసియేషన్, మెదక్ ప్రెసిడెంట్ కె.జనార్ధన్ రెడ్డి పాల్గొంటారు. తూప్రాన్ పరిసర ప్రాంత ప్రజలకు, న్యాయవాదులకు ఇది ఎంతో శుభపరిణామమని, ఇకపై స్థానికంగానే న్యాయ సేవలు అందుబాటులోకి రానున్నాయని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.




ప్రవీణ్ కుమార్ శర్మ కూతురు
పెళ్లికి హాజరైన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తూప్రాన్, నవంబర్ 22 (జనంసాక్షి):
రాష్ట్ర బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు తూప్రాన్‌కు చెందిన ప్రతాప శారద ప్రవీణ్ కుమార్ శర్మ కుమార్తె వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.
ప్రవీణ్ కుమార్ శర్మ కుమార్తె విజయదుర్గ ఎల్లారెడ్డిపేటకు చెందిన దయానంద శర్మ కుమారుడు శ్రీపాద శర్మకు జరిగే వివాహ కార్యక్రమానికి ఆయన తూప్రాన్ లోని లింగ రెడ్డి గార్డెన్లో జరిగి వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ బీఆర్ఎస్ ఇంచార్జి ప్రతాప్ రెడ్డి, తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్, కౌన్సిలర్లు బి ఆర్ఎస్ నాయకులు సతీష్, విజయ్ కుమార్, సలాక కృష్ణమూర్తి శర్మ, సలాక రాజేశ్వర్ శర్మ, బి ఆర్ఎస్ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.





నూతన వధూవరులను
ఆశీర్వదించిన మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి



చేర్యాల, నవంబర్ 22 (జనంసాక్షి): చేర్యాల పట్టణంలోని కళ్యాణి గార్డెన్ లో జరిగిన సీనియర్ జర్నలిస్టు రాళ్లబండి గురుమూర్తి కుమారుని వివాహ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకకు చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోయిని శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు పుర్మ ఆగంరెడ్డి, మెరుగు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, కౌన్సిలర్లు, మార్కెట్ డైరెక్టర్లు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న వ్యక్తి మృతి

చేర్యాల, నవంబర్ 22 (జనంసాక్షి): మండల కేంద్రంలోని చుంచనకోట క్రాస్ రోడ్ వద్ద ఇటీవల జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నాగిరెడ్డిపల్లి కి చెందిన దాసారం రమేష్ (35) అనే వ్యక్తి నిప్పంటించుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడగా స్థానిక ఎస్సై గూడ అపూర్వ రెడ్డి మంటలు ఆర్పి ఆ వ్యక్తిని కాపాడారు. వెంటనే అతన్ని మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతునికి భార్య స్వప్న ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.



పోలియో రహిత సమాజమే లక్ష్యం...

- సర్పంచ్ నాగేందర్ పాటిల్



ఝరాసంగం, నవంబర్ 22(జనంసాక్షి): మండల పరిధిలోని బోరెగావ్ గ్రామంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పట్లోళ్ల నాగేందర్ పాటిల్ పాల్గొని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లి దండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు సమిష్టిగా కృషిచేయాలని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

సిర్గాపూర్‌లో పల్స్ పోలియో కార్యక్రమం



సిర్గపూర్, నవంబర్ 22 (జనంసాక్షి): సిర్గాపూర్ మండల కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ పట్వారి శ్రీనివాసరావు పాటిల్ ప్రారంభించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు కల్వకుర్తిలో ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటన

- అగ్నిమాపక కార్యాలయం ప్రారంభోత్సవం.. 33 కేవీ విద్యుత్ లైన్ల తరలింపునకు శంకుస్థాపన
- వరి కొనుగోలు కేంద్రాలు,సహకార సంఘం పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు



కల్వకుర్తి, నవంబర్ 22 (జనంసాక్షి): కల్వకుర్తిఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నేడు కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు నూతన అగ్నిమాపక కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.10.30 గంటలకు 11వ వార్డు విద్యానగర్ కాలనీలో 33 కేవీ విద్యుత్ తీగల తరలింపు పనులకు శంకుస్థాపన చేస్తారు.ఉదయం 11 గంటలకు మార్కెట్ యార్డు, రైతు వేదికలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారు.మధ్యాహ్నం 12 గంటలకు కల్వకుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు.ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

చెట్ల గౌరారం గ్రామంలో

ఇందిరమ్మ బీమా పథకం పై అవగాహన

- అవగాహనలో పాల్గొన్న సర్పంచ్ దివ్య శ్రీహరి గౌడ్
- ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తామన్నారు



మనోహరాబాద్, నవంబర్ 22 (జనంసాక్షి): మనోహరాబాద్ మండలంలోని చెట్ల గౌరారం గ్రామంలో ఇందిరమ్మ జీవిత బీమా పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పథకానికి సంబంధించిన అర్హత వివరాలు ప్రజలకు క్లుప్తం గా వివరించారు. అదేవిధంగా నమోదు ప్రక్రియ ను చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లా డుతూ గ్రామ ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందిం చేలా నిరంతరం కృషి చేస్తామన్నారు. ఉప సర్పంచ్ రావెల్లి రవీందర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో

అమ్మవార్లను దర్శించుకున్న కాంగ్రెస్ నేత ప్రసాద్ రెడ్డి



కోహిర్, నవంబర్ 22 (జనంసాక్షి): కోహిర్ మండల పరిధిలోని పిచేర్యాగడి పాత తండాలో ఆదివారం రాథోడ్ రమేష్ మహారాజ్ ఆధ్వర్యంలో దుర్గామాత, మైసమ్మ తల్లి ప్రత్యేక బోనాల ఉత్స వాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కే. ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవార్ల ను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను శాలు వాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమం లో తండా సర్పంచ్ రాథోడ్ వినోద్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన డీఎంహెచ్ఓ నరసింగ్ చౌహాన్



నాగల్‌గిద్ద, నవంబర్ 22 (జనంసాక్షి): నారాయణఖేడ్ పట్టణం లోని రాజీవ్ చౌక్ కూడలి వద్ద ఆదివారం చిన్నారులకు డీఎం హెచ్ఓ నరసింగ్ చౌహాన్ పోలియో చుక్కలు వేయించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారులు సూచించారు. పోలియో వ్యాధి నివారణకు తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని, వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. పోలి యో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి చిన్నారికి చుక్క లు అందేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మృతురాలి కుటుంబానికి ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహాయం



కల్వకుర్తి, నవంబర్ 22 (జనంసాక్షి): కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన కొంగళ్ల అంజమ్మ అనారోగ్యం తో మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ స్పందించి,మృతురాలి కుటుంబా నికి తక్షణ ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఉప్పల వెంకటేష్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అభ్యర్థి ఐలా శేఖర్ గౌడ్, వీరపాకుల నాగరాజు, నరసింహ, శ్రీను, పరశురామ్, లింగం, మల్లేష్, జంగయ్య, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తులసి దామోదర కళ్యాణం



మద్దకల్, నవంబర్ 22 (జనంసాక్షి): పవిత్ర కార్తీక మాసంలో నిర్వహించే తులసీ దామోదర కళ్యాణం ఆదిశేలా క్షేత్రం మద్ద కల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు.దేవాలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణ మాన్య పట్వారి ప్రహ్లాద రావు దంపతులు తులసి పూజలో పాల్గొని పూజలు నిర్వహించారు.ఈ సందర్భం గా ఆలయ అర్చకులు తులసి కళ్యాణాన్ని ఘనంగా జరిపిం చారు.ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అంద జేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ శేషదాసవంసీయులు దీరేంద్ర దాస్,చంద్రశేఖర రావు,రమేష్,రవి తదితరులు పాల్గొన్నారు.

అనవసర సిజేరియన్లకు స్వస్తి పలకాలి

- తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యం.. సహజ ప్రసవాలపై అవగాహన
- సహజ ప్రసవాలపై అవగాహనకు భారీ వాక్

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి): సహజ ప్రసవాల ప్రాముఖ్యతపై మహిళలు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సొసైటీ ఆఫ్ మిడ్‌వైవ్స్ ఇండియా ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ఆదివారం భారీ అవగాహన వాక్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఏకకాలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్, కార్యక్రమ సమన్వయకర్త విజయకుమారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి ఐబీ వరకు వాక్ చేపట్టారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణు, జనని ఆసుపత్రి స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ కోమల్ జీత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి, బిడ్డ ఆరోగ్యానికి సహజ ప్రసవం ఎంతో ప్రాధాన్యమని, అనవసర శస్త్రచికిత్స ప్రసవాలను తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన



పెంచాలని సూచించారు.

గర్భధారణ సమయంలో సమతుల్య పోషకాహారం తీసుకోవడం, తగిన శారీరక వ్యాయామం, ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించడం, మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు వైద్య నిపుణుల సూచనలు పాటించడం సహజ ప్రసవానికి దోహదపడతాయని తెలిపారు. ప్రతి గర్భిణికి సురక్షితమైన, గౌరవప్రదమైన ప్రసవ సంరక్షణ అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బంది, కుటుంబ సభ్యులు, సమాజంపై ఉందన్నారు.

ఈ వాక్‌లో సంగారెడ్డి, ఆందోల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, ఎంఎన్ఆర్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఐబీ వద్ద తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తూ, సహజ ప్రసవాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని పాల్గొన్న వారంతా ప్రతిజ్ఞ చేశారు.

రూ.11.08 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- కోహిర్ మండలంలో 500 ఇళ్లు మంజూరు.. 434 ఇళ్లకు మార్కౌట్ పూర్తి
- మిగిలిన 129 ఇళ్ల నిర్మాణ పురోగతిపై అధికారుల స్పష్టత ఏది?







కోహిర్, నవంబర్ 22 (జనంసాక్షి): పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కోహిర్ మండలంలో కొనసాగుతోంది. మండలంలోని 23 గ్రామాలకు మొత్తం 500 ఇళ్లు మంజూరు కాగా, ఇందుకోసం రూ.11.08 కోట్ల నిధులు కేటాయించారు. దీంతో సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

వివిధ దశల్లో నిర్మాణాలు...

మంజూరైన 500 ఇళ్లలో ఇప్పటివరకు 434 ఇళ్లకు మార్కౌట్ ప్రక్రియ పూర్తయింది. నిర్మాణ దశల వారీగా 56 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో, 17 ఇళ్లు లింటెల్ స్థాయిలో, 132 ఇళ్లు స్లాబ్ స్థాయిలో, మరో 166 ఇళ్లు ఫినిషింగ్ దశలో ఉన్నట్లు హౌసింగ్ ఏఈ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ వివరాల ప్రకారం మొత్తం 371 ఇళ్ల నిర్మాణ పురోగతి నమోదైంది.

మిగిలిన ఇళ్ల పరిస్థితి ఏమిటి?

మండలానికి 500 ఇళ్లు మంజూరవగా, 434 ఇళ్లకు మార్కౌట్ పూర్తయింది. అయితే నిర్మాణ దశల్లో 371 ఇళ్ల వివరాలే అందుబాటులో ఉన్నాయి.



దీంతో మంజూరైన ఇళ్లలో 129 ఇళ్ల పురోగతిపై స్పష్టత రావాల్సి ఉంది. మార్కౌట్ పూర్తయిన 434 ఇళ్లలో మిగిలిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయా? ఏవైనా సాంకేతిక సమస్యలతో నిలిచిపోయాయా? అనే వివరాలను అధికారులు వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాల వారీగా పూర్తి గణాంకాలు ప్రకటించాలని సూచిస్తున్నారు.

బిల్లులు సకాలంలో విడుదల చేయాలి

నిర్మాణ సామగ్రి ధరలు, కూలీల ఖర్చులు పెరగడంతో పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం భారంగా మారుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన నిర్మాణ దశల ప్రకారం బిల్లులు సకాలంలో విడుదల చేస్తే పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది.

బిల్లుల జాప్యంతో నిర్మాణాలు నిలిచిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మండలంలోని 23 గ్రామాల్లో మంజూరైన 500 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యానికి అనుగుణంగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.

నిర్మాణాలు ప్రారంభించని వారికి అవగాహన కల్పించి, లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలి. ఇందిరమ్మ ఇళ్ల పథకం మంజూరుకే పరిమితం కాకుండా ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంతింటి కలను నిజం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

18వ వార్డులో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు



సదాశివపేట, నవంబర్ 22 (జనంసాక్షి): పట్టణంలోని 18వ వార్డు పిట్టలకేరి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బిట్ల నిఖిత ప్రేమ్‌కుమార్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా, ఆరోగ్య శాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

శతపద కవితాస్తుతి పుస్తక ఆవిష్కరణ



కోహెడ, నవంబర్ 22 (జనంసాక్షి): తెలంగాణ తత్వకవి సిద్దప్ప వరకవి రాజయోగి జీవిత,సాహిత్య విశేషాలతో ప్రముఖ కవి సుప్పని సత్యనారాయణ రాసిన పద సాహిత్యం శ్రీ శ్రీ శ్రీ సిద్దప్ప వరకవి రాజయోగి శతపద కవితాస్తుతి పుస్తకావిష్కరణ రేపు 24వ తేది మంగళవారం రోజు కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలోని సిద్దప్ప ఆశ్రమంలో జరగనుందని సిద్దప్ప కుమారుడు అనంతవరం మాణిక్య లింగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సాహిత్య అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దిగ్వాల్‌లో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం

- చిన్నారులకు పోలియో చుక్కలు వేయించిన సర్పంచ్ అహమ్మద్ అలీ



కోహిర్, నవంబర్ 22 (జనంసాక్షి): కోహిర్ మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలో ఆదివారం సర్పంచ్ అహమ్మద్ అలీ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సర్పంచ్ తల్లి దండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణా నికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అర్హులైన చిన్నారులందరికీ చుక్కలు అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐదోసారి అయ్యప్ప మాల ధరించిన విజయ్ కుమార్



కోహిర్, నవంబర్ 22(జనంసాక్షి): కోహిర్ మండలం చింతల్ ఘాట్ గ్రామానికి చెందిన తమ్మనితోట విజయ్ కుమార్ పాటిల్ ఐదోసారి అయ్యప్ప స్వామి మాల ధరించి 41 రోజుల పాటు కఠిన నియమ నిష్ఠలతో దీక్ష పూర్తి చేసుకున్నారు. అనంతరం ఇరుముడి కట్టుకొని శబరిమల యాత్రకు బయలు దేరారు. స్వామివారి దర్శనం చేసుకొని కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించ నున్నట్లు తెలిపారు.

12వ వార్డులో పల్స్ పోలియో కార్యక్రమం

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి: కౌన్సిలర్ పులిమామిడి మమత



సదాశివపేట, నవంబర్ 22(జనంసాక్షి): పట్టణంలోని 12వ వార్డులో శ్రీ ఈశ్వర మార్కండేయ మందిరం సమీపంలో ఆశా వర్కర్ లావణ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో శిబిరాన్ని వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ఒక్క చిన్నారి కూడా పోలియో బారిన పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ లావణ్య, నర్సింలు, సోమశంకర్, అఖిల్, శ్రీధర్, ద్వాక్రా మహిళలు, ఆర్.పి. రుమాండ్ల శారద, భవాని, అయేషా తబస్సుమ్, సౌజన్య, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములపల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా

శ్రీ ఆంజనేయస్వామి ఆలయ గడప ప్రతిష్ఠాపన మహోత్సవం




కోహెడ, నవంబర్ 22 (జనంసాక్షి): మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గడప ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా వేద బ్రాహ్మణులచే నిర్వహించారు. వేద బ్రాహ్మణులు కొయ్యడ ప్రసాద్ రావు శర్మ, విద్యాధర శర్మ ల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల నడుమ శాస్త్రోక్తంగా గడప ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్, ఆలయ కమిటీ చైర్మన్ పోలు శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరి సహకారం, భక్తుల భాగస్వామ్యంతో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో సంతోషకరమని, ఈ పవిత్రమైన కార్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు, భక్తులకు సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి జాలిగం రమేష్,ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు వేముల వీరస్వామి, సకినాల రమేష్, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కల్హేర్ మండలంలో విజయవంతంగా పల్స్ పోలియో కార్యక్రమం



కల్హేర్, నవంబర్ 23 (జనంసాక్షి): కల్హేర్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.



మండల వైద్యాధికారిణి డాక్టర్ జెబా షహమీన్ ఆధ్వర్యంలో 20 బూత్‌లు ఏర్పాటు చేసి సుమారు 2,200 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కల్హేర్, కృష్ణాపూర్, ఫతేపూర్ తదితర గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిం చారు. మండలాన్ని రెండు రూట్లుగా విభజించి పర్యవేక్షించారు. బూత్‌లకు రాలేని చిన్నారులకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తామని వైద్యాధికారిణి తెలిపారు. ఏ చిన్నారి మిగిలిపోకుండా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.





ఖిల్లా వివాహ వేడుకలో పాల్గొన్న
మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



ఘనపూర్, నవంబర్ 22 (జనంసాక్షి): మండల కేంద్రంలోని స్థానిక బాదం సరోజిని దేవి కళ్యాణ మండపంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య కుమార్తె శిరీష వివాహం ఆదివారం బాలకృష్ణతో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై నూతన వధూవరులు బాలకృష్ణ, శిరీషలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ప్రేమానురాగాలు, ఆయురారోగ్యాలతో కల కాలం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రితో పాటు జిల్లా నాయకులు, ఘనపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

కాళికామాత ఆలయ పునర్నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన మాజీ ఎంపీ రావుల



ఖిల్లా ఘనపురం, నవంబర్ 22 (జనంసాక్షి): మండల కేంద్రంలోని కమ్మరి గిరి శివాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న కాళికామాత ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం మాజీ రాజ్య సభ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలు మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక కేంద్రాలని, భక్తి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆర్థిక సాయం అందించిన రావులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నందిమల్ల అశోక్, అమరేందర్, జానకిరాములు, పులేందర్ చారి, బ్రహ్మయ్య చారి, శ్రీనివాసులు చారి, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి విస్తరణ లేకపోవడంతో
ఇబ్బంది పడిన డ్రైవర్లు, ప్రయాణికులు

- కల్వరాల-వీపనగండ్ల రహదారిపై ఇరుకైన మార్గంతో వాహనాల రాకపోకలకు అవస్థలు



వీపనగండ్ల, నవంబర్ 23 (జనంసాక్షి): వీపనగండ్ల కల్వరాల ప్రధాన రహదారిపై రోడ్డు విస్తరణ లేకపోవడంతో బస్సు డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రహదారి ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా బస్సులు వచ్చినప్పుడు క్రాసింగ్ చేసుకోవడానికి డ్రైవర్లు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బస్సులను పక్కకు తప్పించి ముందుకు వెళ్లేందుకు తగినంత స్థలం లేకపోవడంతో ప్రయాణికులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రోడ్డు విస్తరణ చేపట్టకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని బస్సు డ్రైవర్లు అన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు స్పందించి ప్రధాన రహదారిని విస్తరించి, బస్సులు, ఇతర వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు అన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి): వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం పలు ప్రాంతాల్లో నిర్వహించిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నందిమల్ల చంద్రమౌళి కుమారుడి వివాహం మానేపల్లి మండలం వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు.



అదేవిధంగా వనపర్తి పట్టణంలోని హిందూ గార్డెన్‌లో జీహెచ్ఎం కొన్నోజు గణేష్ కుమార్ కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని నర్సప్ప కన్వెన్షన్ హాల్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్ తిరుపాజి కుమారుడి వివాహ వేడుకకు, చంద్ర కన్వెన్షన్ హాల్‌లో శ్రీనివాసులు కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో వివాహ వేడుకలకు విశిష్టమైన స్థానం ఉందన్నారు. వివాహం ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాకుండా రెండు కుటుంబాల మధ్య ప్రేమానుబంధాలు, ఆత్మీయతలు, బాధ్యతలను పెంపొందించే పవిత్ర బంధమని పేర్కొన్నారు. సంప్రదాయాలు, కుటుంబ విలువలకు ప్రతీకగా నిలిచే వివాహాలు సమాజంలో ఐక్యతను, పరస్పర అనుబంధాలను బలోపేతం చేస్తాయని అన్నారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, జిల్లా క్రీడా అధికారి సుధీర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కదిరె రాములు, వివిధ మండలాల నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి ఆర్థిక భరోసా ఇందిరమ్మ బీమా పథకం

- వింజపల్లి సర్పంచ్ అన్నాడి శ్రీజ - జీవన్ రెడ్డి



కోహెడ, నవంబర్ 22 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రములో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం ప్రతీ కుటుంబానికి భరోసా ఇస్తుందని మండలంలోని వింజపల్లి గ్రామ అన్నాడి శ్రీజ – జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భీమా పథకంలో పేరు నమోదుకు ప్రభుత్వం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ములోని పేద కుటుంబాల కోసం కొత్త పథకానికి శ్రీకారం చుట్టిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, అలాగే రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ ల మంత్రి పొన్నం ప్రభాకర్ కు సర్పంచ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో ప్రభుత్వం ఇంకా మరెన్నో ప్రజాపయోగకరమైన పథకాలు ప్రవేశ పెట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తుందని సర్పంచ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

వరిగుంతం గ్రామానికి
గర్వకారణం.. హైకోర్టు న్యాయవాదిగా నీరుడి ప్రశాంత్

మారుమూల పల్లె నుంచి ఉన్నత న్యాయస్థానం వరకు.. పట్టుదలతో లక్ష్య సాధన



కొల్చారం, నవంబర్ 22 (జనంసాక్షి): సాధించాలనే తపన, పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని కొల్చారం మండలం వరిగుంతం గ్రామానికి చెందిన నీరుడి ప్రశాంత్ నిరూపించారు. మారుమూల గ్రామీణ నేపథ్యం నుంచి ఎదిగి తెలంగాణ హైకోర్టు న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేయడంతో గ్రామానికి గర్వకారణంగా నిలిచారు.


ప్రశాంత్ తన ప్రాథమిక విద్య నుంచి పదో తరగతి వరకు వరిగుంతం గ్రామంలోనే చదువుకున్నారు. అనంతరం కొల్చారంలో ఇంటర్మీడియట్, సిద్దిపేటలోని ఎస్ఎంహెచ్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. న్యాయవిద్యపై ఆసక్తితో ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో ఎల్ఎల్బీ పట్టా పొందారు. తాజాగా తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేసి తన లక్ష్యాన్ని సాధించారు.

ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామం నుంచి వచ్చి ఉస్మానియా లా కాలేజీలో చదివి, నేడు తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ స్థాయికి చేరుకోవడానికి ప్రోత్సహించిన తల్లిదండ్రులు, గురువులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. సామాన్య ప్రజలకు, పేదలకు న్యాయం అందించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

గ్రామీణ నేపథ్యం నుంచి కష్టపడి ఉన్నత స్థాయికి ఎదిగిన నీరుడి ప్రశాంత్ విజయంపై వరిగుంతం గ్రామస్తులు, కొల్చారం మండల ప్రజలు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యువతకు ఆయన ప్రస్థానం స్ఫూర్తిదాయకమని అభినందిస్తున్నారు. భవిష్యత్తులో న్యాయవాద రంగంలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి పేదలకు న్యాయం అందించాలని ఆకాంక్షిస్తున్నారు.

మృతుడి కుటుంబానికి
ఎమ్మెల్యే కసిరెడ్డి ఆర్థిక సాయం

సామ సాయిలు కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక భరోసా



కల్వకుర్తి, నవంబర్ 22(జనంసాక్షి): నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం కురుమిద్ద గ్రామానికి చెందిన సామ సాయిలు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకులు భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దగ్గర బాల్‌రెడ్డి,మాజీ సర్పంచులు లాల్‌కోట దామోదర్ గౌడ్,కాంగ్రెస్ మాజీ ఉపసర్పంచ్ విజయభాస్కర్,యువ నాయకుడు బీస సురేష్. జంగయ్య. యాదగిరి. అంజయ్య.రాములు. చెన్నయ్య.తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను ఆహ్వానించకుండానే
ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం



మద్దకల్, నవంబర్ 22 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లా మద్దకల్ మండలం కుర్తి రావులచెరువు గ్రామంలో ఆదివారం రాముడు అనే లబ్ధిదారుడి ఇందిరమ్మ ఇంటిని సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండానే ప్రారంభించడంపై గ్రామంలో చర్చ జరుగుతోంది. గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్‌ను ఆహ్వానించకుండా ఇతర వ్యక్తితో ప్రారంభోత్సవం చేయడంపై గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గతంలోనూ ఇలాంటి అవమానం జరిగిందని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా సర్పంచ్‌కు సమాచారం ఇచ్చి ప్రోటోకాల్ పాటించాలని కోరారు. అధికారులు స్పందించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి.

ఎస్‌బీఐ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో 50 సైకిళ్ల పంపిణీ

సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సైకిళ్ల అందజేత





ఖిల్లా ఘనపురం, నవంబర్, 22 (జనంసాక్షి): మండల పరిధిలోని మామిడిమడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆదివారం ఎస్‌బీఐ లేడీస్ క్లబ్, హైదరాబాద్ ఆధ్వర్యంలో 50 సైకిళ్లను పంపిణీ చేశారు. సుమారు రూ.3 లక్షల విలువైన సైకిళ్లను సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నప్ప మాట్లాడుతూ.. పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి నడిచి రావడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెనికి తండా, ముందరి తండా, సాల్కలాపూర్, పర్వతాపూర్ గ్రామాలకు చెందిన విద్యార్థుల ఇబ్బందులను ఎమ్మెల్యే మేఘా రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన చొరవతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి సూచనల మేరకు పాఠశాలకు సైకిళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు.

విద్యార్థుల అవసరాలను గుర్తించి సైకిళ్లు అందించిన ఎస్‌బీఐ, లేడీస్ క్లబ్ ప్రతినిధులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి, లేడీస్ క్లబ్ చైర్మన్ శ్రీదేవి, మామిడిమడ సర్పంచ్ బాల్ లింగం, ప్రధానోపాధ్యాయులు చిన్నప్ప, ఘనపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గయ్య, వెనికి తండా మాజీ సర్పంచ్ రాజు నాయక్, ఉపాధ్యాయులు రజనీకాంత్, శ్రీకాంత్,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని
వాహనం ఢీకొని మహిళ మృతి

గండీడ్, నవంబర్ 22 (జనంసాక్షి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన, మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని జానంపల్లి గ్రామ శివారులో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మహమ్మదాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘన్‌పూర్ మండలం మామిడిమాడ గ్రామానికి చెందిన, సదమోని కృష్ణవేణి(41), తండ్రి బాలయ్య, కోస్గిలోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు.5గంటల సమయంలో జానంపల్లి గ్రామ శివారులో వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం డ్రైవర్ ఆమెను ఢీకొట్టాడు.ఈప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన కృష్ణవేణి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తల్లి ఎల్లమ్మ ఫిర్యాది మేరకు కేసు నమోదు చేసినట్లు,ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

రజక సంఘం జిల్లా
సమావేశాన్ని విజయవంతం చేయండి

- జిల్లా నాయకుల పిలుపు



వనపర్తి, నవంబర్ 22 (జనంసాక్షి): ఈ నెల 29న నిర్వహించనున్న వనపర్తి జిల్లా రజక సంఘం సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం ముఖ్య నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అన్ని మండలాల రజక సంఘం నాయకులు, సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన జిల్లా కమిటీ ఏర్పాటు సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కమిటీలో అన్ని మండలాలకు సముచిత ప్రాధాన్యత కల్పించాలని, సంఘం అభివృద్ధికి కృషి చేయాలనుకునే యువకులు, నాయకులు ముందుకు రావాలని సూచించారు. సమావేశంలో మాజీ ప్రధాన కార్యదర్శి రచనూరు వెంకట్రాములు, మాజీ కన్వీనర్ చిట్యాల కొండయ్య, సిట్టిరాజుల సాలేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సహకార సంఘం
మంజూరుపై ఎమ్మెల్యే మేఘా రెడ్డికి కృతజ్ఞతలు

కిసాన్ సెల్ మండల అధ్యక్షులు కొన్నూరు బాలరెడ్డి



ఖిల్లా ఘనపురం, నవంబర్ 22 (జనంసాక్షి): మండల పరిధిలోని సోలీపూర్ గ్రామంలో రైతు సహకార సంఘం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై గ్రామ రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షులు కొన్నూరు బాలరెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్న సహకార సంఘాన్ని స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి హామీ మేరకు మంజూరు చేయించారని తెలిపారు. రైతుల సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

భవిష్యత్తులో సోలీపూర్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు కూడా ఎమ్మెల్యే కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో రామ్ మోహన్ రెడ్డి, కిషోర్ కుమార్ రెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో సందడి చేసిన
2005 ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రులు



కేటిదొడ్డి, నవంబర్ 22(జనంసాక్షి): ఐజ పట్టణంలోని ఎంబీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన వివాహ వేడుకకు 2005 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు హాజరై సందడి చేశారు. తమ మిత్రుడు రవికుమార్ గౌడ్ సోదరుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. చాలాకాలం తర్వాత కలుసుకున్న మిత్రులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం గ్రూప్ ఫోటో దిగారు.

అయ్యో.. యువకుడి దుర్మరణం !



ఎర్రవల్లి, నవంబరు 22 (జనంసాక్షి): గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం జింగలపల్లి సమీపంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని మల్దకల్ మండల కేంద్రానికి చెందిన ఉప్పరి మల్లేశ్ కుమారుడు భీముడిగా పోలీసులు గుర్తించారు.పని నిమిత్తం బయటకు వెళ్లిన భీముడు, తిరిగి ఇంటికి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో తీవ్ర రక్తస్రావమై అతడు ప్రాణాలు విడిచాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. చేతికి అందివచ్చిన కుమారుడు అకాల మరణం చెందడంతో మృతుడి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.ఈ విషాద ఘటనతో మల్దకల్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం.. ఎస్సీ వర్గాల అభ్యున్నతికి కృషి

- 34 మందితో కూడిన జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ కమిటీ ప్రకటన
- కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా అధ్యక్షులు ఈరపోగు రాజ్‌కుమార్



వనపర్తి బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు, ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు కృషి చేయడమే లక్ష్యంగా జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు ఈరపోగు రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు 34 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీని ప్రకటించారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఎస్సీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉండాలని కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు.కమిటీలో చోటు దక్కించుకున్న ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను పదవులుగా కాకుండా పార్టీకి సేవ చేసే అవకాశంగా భావించాలని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు. ఐక్యత, క్రమశిక్షణ, సమష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మరింత చేరువయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీ, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గంధం రాజశేఖర్, కౌన్సిలర్స్ గంధం శరబంధ, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కొల్లా వెంకటేష్, పెద్దమందడి అధ్యక్షులు కొమ్ము వెంకటేష్, టౌన్ అధ్యక్షులు గొర్ల అనిల్, నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు విద్యార్థులు డిసెంబర్ 7న చలో ఢిల్లీ విజయవంతం చేయండి

- ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్



అమరచింత, ఆదివారం 22 (జనంసాక్షి): యువత సమస్యల పరిష్కారం, కోసం విద్యార్థుల భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం డిసెంబర్ 7న ఢిల్లీలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజాస్వామిక వాదులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ పిలుపునిచ్చారు.

చలో ఢిల్లీ కార్యక్రమానికి యువతను సమీకరించేందుకు ఏఐవైఎఫ్ చలో ఢిల్లీ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎండి కుతుబ్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజాస్వామికవాదులు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్య, విద్యా రంగంలోని సమస్యలు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పేర్కొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు పెరుగు దళ ప్రజలపై భారంగా మారుతున్న తరుణంలో దేశభక్తి ముసుగులో విద్వేష రాజకీయాలు చేయడం తగదని, యువత సమస్యలు, విద్యార్థుల భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం డిసెంబర్ 7న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రణీత్ మనోజ్ శివ అజిత్ అశోక్ బన్నీ సిద్దు నాయక్ అఖిల్ సిద్దు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడపరాదు

• మద్యం సేవించి వాహనాలు నడపరాదు... హవెలి ఘనపూర్ ఎస్సై కృష్ణయ్య



మెదక్, నవంబర్ 22 (జనంసాక్షి): హవేలీ ఘన్పూర్ మండలంలోని ఆదివారం నాడు ఎస్సై కృష్ణయ్య ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్యం సేవించిన వారికి మరియు వాహనదారులకు కౌన్సిలింగ్ కార్యక్రమం చేపట్టారు. మద్యం తాగి డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే యజమానితో పాటు బైక్ను కూడా సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. బైకులకు, ఇతర వాహనాలకు అన్ని ధ్రువపత్రాలు వెంట కలిగి ఉండాలని అన్నారు. మండలంలో ప్రతిరోజు వివిధ గ్రామాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం చేపడతామని తెలిపారు ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



చిన్న శంకరంపేట, నవంబర్ 22 (జనంసాక్షి): వేసిన పంట సరిగా పండగ అప్పుల బాధతో ఓ రైతు పాల్పడిన సంఘటన చిన్న శంకరంపేట మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది స్థానిక ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం... పట్టణ కేంద్రానికి చెందిన వడ్డే నారాయణ (35) పారిశుద్ధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మరియు తనకు ఉన్న ఒక ఎకరా పొలంలో వ్యవసాయం పంట వేయగా , పంట సరిగా పండక చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై శనివారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడినాడని మృతుడి భార్య వడ్డే యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.
మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కూతుర్లు రేణుక, గాయత్రి, లక్ష్మీలు ఉన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తైక్వాండో విద్యార్థి ప్రజ్ఞకు బంగారు పతకం

• లాంగ్ జంప్‌లో అద్భుత ప్రతిభ
• అభినందించిన జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు



నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి): జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో నాగర్‌కర్నూల్‌కు చెందిన తైక్వాండో విద్యార్థి ప్రజ్ఞ సత్తా చాటి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. కల్వకుర్తి పట్టణంలోని జెడ్పీ హెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రజ్ఞ లాంగ్ జంప్ విభాగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్‌ను అందుకుని నాగర్ కర్నూల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.
తైక్వాండో క్రీడలో శిక్షణ పొందుతున్న ప్రజ్ఞ అథ్లెటిక్స్ పోటీల్లోనూ తన ప్రతిభను నిరూపించుకోవడం విశేషం. క్రీడల పట్ల ఆసక్తి, నిరంతర సాధన, పట్టుదలతోనే ఈ విజయాన్ని సాధించిందని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థి ప్రజ్ఞ సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తెప్ప శ్రీను, జనరల్ సెక్రటరీ రవికుమార్, జిల్లా ట్రెజరర్ మాస్టర్ స్వాతి ప్రజ్ఞను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.
క్రీడల్లో విద్యార్థులు రాణించేందుకు నిరంతరం సాధన చేస్తూ, తమ ప్రతిభను వెలికితీయాలని వారు సూచించారు. జిల్లాస్థాయిలో బంగారు పతకం సాధించిన ప్రజ్ఞను పలువురు క్రీడాభిమానులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

విశ్వహిందూ పరిషత్ సభ్యత్వ నమోదు పుస్తకాలకు ప్రత్యేక పూజలు

• నవంబర్ 22 నుండి డిసెంబర్ 6 వరకు హితచింతక్ అభియాన్



మక్తల్, నవంబర్ 22 (జనంసాక్షి): సంఘే శక్తి కలియుగే కలియుగంలో సంఘటనే మహాశక్తి అనే నినాదంతో, ధర్మ రక్షణ, సనాతన వైభవాన్ని చాటేందుకు విశ్వహిందూ పరిషత్ (VHP), బజరంగ్ దళ్ మక్తల్ ప్రఖండ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం స్థానిక శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ సభ్యత్వ నమోదు పుస్తకాలకు నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతి మూడేళ్లకోసారి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హితచింతక్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అయోధ్యలో భవ్యమైన శ్రీరామ మందిర ప్రారంభోత్సవం తర్వాత, ఈసారి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సభ్యత్వ నమోదును చేపడుతున్నట్లు పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ కేవలం ధార్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా, సమాజ సేవ, ధర్మ పరిరక్షణలో ఎల్లప్పుడూ ముందుంటుందని వివరించారు.
నవంబర్ 22 నుండి డిసెంబర్ 6 వరకు కొనసాగే ఈ 'హితచింతక్ అభియాన్' కార్యక్రమంలో కుల, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా హిందూ బంధువులందరూ పెద్ద ఎత్తున పాల్గొని, విశ్వహిందూ పరిషత్‌లో సభ్యత్వం తీసుకోవాలని మక్తల్ ప్రఖండ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కో-కన్వీనర్ భీమేష్, ప్రఖండ సంయోజక్ రాహుల్, శివ, మండల సంయోజక్ రామాంజనేయులు, కర్ని లింగం, శంకర్, పాలమూరు శ్రీను, మక్తల్ పట్టణ సంయోజక్ గుంతలి శ్రీను తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

మైకోడ్ గ్రామంలో హైమాక్స్ లైట్

ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్



నాగల్గిద్ద, నవంబర్ 22 (జనంసాక్షి): మానూర్ మండలం మైకోడ్ గ్రామంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ సహకారంతో మంజూరైన హైమాక్స్ లైట్‌ను నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ గ్రామస్తుల సమక్షంలో ఈరోజు ప్రారంభించారు.
ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాక్స్ లైట్‌ను ప్రారంభించి, గ్రామ ప్రజలకు మెరుగైన విద్యుత్ వెలుగులు అందుబాటులోకి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ రెడ్డి, మాణిక్ రావు పటేల్, తిమ్మాపూర్ సర్పంచ్ భరత్ పటేల్, మాజీ సర్పంచ్ రేవప్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంగన్న, గంగాయస్వామి, ఓంకార్,గండ్ల రాజు కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కామారం తండాలో ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం ప్రారంభం



చిన్న శంకరంపేట్, నవంబర్ 22 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ భీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ ఆదేశాల మేరకు ఈరోజు చిన్నశంకరంపేట మండలం కామారం తాండా గ్రామంలో ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో దామోదర్ సర్పంచ్ హలవత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని లక్ష్యంతో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఈ పథకం నమోదు ప్రక్రియ నిరంతరంగా మూడు వారాల పాటు కొనసాగుతుందని ప్రతి రేషన్ కార్డు లోని కుటుంబ సభ్యులలో అర్హులైన ఒకరు ఈ పథకంలో చేరి ప్రభుత్వ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓ దామోదర్, గ్రామ సర్పంచ్ ణతీ హలావత్ మోహన్ నాయక్, పంచాయతీ కార్యదర్శి పద్మ ఉపసర్పంచ్ గుగ్లోత్ విజయ, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం, వస్త్రాల పంపిణీ

శ్రీ సిద్ధంశెట్టి నరసమ్మ 5వ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు



అచ్చంపేట, నవంబర్ 22 (జనంసాక్షి): అచ్చంపేటలోని వృద్ధాశ్రమంలో శ్రీ సిద్ధంశెట్టి నరసమ్మ గారి 5వ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. నరసమ్మ గారి కుమారుడు సిద్ధంశెట్టి కోటీశ్వర్, రాజేశ్వరి దంపతులు వృద్ధాశ్రమంలోని సుమారు 30 మంది వృద్ధులకు అన్నదానం చేయడంతో పాటు వస్త్రాలను పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమాన్ని IVF డివిజన్ కమిటీ, జిల్లా కమిటీ, మహిళా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. IVF డివిజన్ కమిటీ సభ్యులు ఉప్పల పరమేశ్వర్, దాచేపల్లి శ్రీనివాస్, అర్థం వినోద్, బండారు రామచంద్రయ్య, ఇల్లెందుల పరమేశ్వర్, జూలూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేశారు. సేవా కార్యక్రమం నిర్వహించిన సిద్ధంశెట్టి కోటీశ్వర్, రాజేశ్వరి దంపతులను వృద్ధాశ్రమంలోని వృద్ధులందరూ మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.

చలో ఢిల్లీని విజయవంతం

చేయండి : AIYF జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్

ఆత్మకూర్, నవంబర్ 22 (జనంసాక్షి): యువత సమస్యల పరిష్కారం, విద్యార్థుల భవిష్యత్తు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం డిసెంబర్ 7న ఢిల్లీలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని AIYF జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ పిలుపునిచ్చారు.
ఆదివారం ఆత్మకూర్ బీసీ హాస్టల్ లో చలో ఢిల్లీ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజాస్వామ్యవాదులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలన్నారు.
నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలపై భారం పడుతున్న తరుణంలో దేశభక్తి ముసుగులో హింస, విద్వేష రాజకీయాలు చేయడం తగదన్నారు.
డిసెంబర్ 7న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రణీత్, మనోజ్, శివ, అజిత్, అశోక్, బన్నీ, సిద్దు నాయక్, అఖిల్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.